ఏడాదిగా సేవలకు తాళం

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బోసిపోయిన సచివాలయాలు
- 12 నెలలు కావస్తున్నా అందని సేవలు
- రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందక తిప్పలు



పాలకల గ్రామ సచివాలయం

ఐరాల: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలు న్నచోటనే ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేశారు. ప్రతి సచివాలయానికి 15 మంది వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందించారు. దేశంలో ఎక్కడా జరగని రీతిలో రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కింది. పల్లెల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంది. అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కనపెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. నాడు కళకళలాడిన సచివాలయాలు నేడు సేవలు అందక బోసిపోయాయి. అధికారంలోకి వచ్చి 12 నెలలు కావస్తున్నా ఒక్క ప్రభుత్వం పథకం కూడా అందక సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాలు, వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిష్టిబొమ్మల్లా మారాయి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాయాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో సచివాలయాలన్నీ దిష్టిబొమ్మల్లా మారాయి. ఎన్నికల్లో చెప్పిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేయలేదు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు, సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

–లోకనాథ్‌రెడ్డి, 35 యర్లంపల్లె, ఐరాల

అందుబాటులోకి తీసుకురావాలి



సచివాలయాల్లో రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు నూతన పింఛన్ దరఖాస్తు వెబ్‌సైటు తెరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 12 నెలలవుతున్నా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. సచివాలయాలన్నింటినీ ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది.

– సురేంద్రయాదవ్, పెద్దగొల్లపల్లి, ఐరాల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సేవలు ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రూ.40 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టింది. మండలంలో 28 పంచాయతీలకుగానూ 19 సచివాలయాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను ప్రజలకు నేరుగా అందజేశారు. ప్రజలకు వీలున్నప్పుడే సమస్యలను విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, పోలీస్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ తదితర సేవలు వివిధ ధ్రువీకరణ పత్రాలు ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు, పల్లెల్లోనే పొందేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

ద్రౌపది ఆలయ మహా కుంభాభిషేకం


కలశపూజలు చేస్తున్న వేద పండితులు

గుడిపాల: ద్రౌపది సమేత ధర్మరాజులు, మునేశ్వరుల ఆలయ మహా కుంభాభిషేకం శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పిళ్లారికుప్పంలో విశేష సంధి రెండవకాల యాగశాల పూజ, హోమాలు, విశేష ద్రవ్య హోమాలు, మహా సంకల్పం, పూర్ణాహుతి పూజలు చేశారు. రాత్రి తోలు బొమ్మలాట కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. తొమ్మిది నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం గర్భగుడిలో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఎంపీడీఓలకు సన్మానం


సన్మానిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల జిల్లాలో నలుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి లభించిన విషయం తెలిసిందే. అందులో ముగ్గురిని డీపీఓ కార్యాలయంలో డీపీఓ సుధాకర్‌రావు సన్మానించారు. గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి, పురుషోత్తం, రాజశేఖర్‌బాబుకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓలు, మేజర్ పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛాంధ్ర – స్వర్ణ ఆంధ్ర, పన్నుల వసూలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న జవహర్

బంగారుపాళెం: విద్యార్థులు గ్రంథాలయ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్ డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. సులభపద్ధతుల్లో బొమ్మలను ఎలా గీయాలనే విషయాలను అంశాలను పిల్లలకు నేర్పించారు. పిల్లలకు ఇంగ్లీషు గ్రామర్, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తున్నాట్లు తెలిపారు. గ్రంథాలయ వేసవి తరగతులు గత నెల 28వతేదీ నుంచి ప్రారంభం అయ్యాయన్నారు. జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బంగారుపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధనంజయరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తోందని గ్రంథాలయాధికారి సుజాత తెలిపారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పించడం, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు చదివించడం తదితర అంశాల్లోని మెలకువలను వివరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో ఎండలో తిరగనీయకుండా గ్రంథాలయాలకు పంపాలని కోరారు. విరామం సమయంలో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల దందా!

పలమనేరు: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల దందా పెచ్చుమీరుతోంది. వీరంతా సిండికేట్‌గా మారి అత్యవసర రోగుల ప్రాణాలతో వ్యాపారాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా నెల్లిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుకు గురై కుటుంబీకులు ఇక్కడి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అతన్ని పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అయితే ఇక్కడి ఆస్పత్రి అంబులెన్స్, 108 వాహనాలు తిరుపతి దాకా వెళ్లవు. ఎమర్జెన్సీ సేవలకు కేవలం జిల్లా ఆస్పత్రి దాకా ఈ వాహనాలకు అనుమతులున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని పట్టణంలోని కొందరు ఆస్పతి వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి పలమనేరు నుంచి తిరుపతికి 110 కిలోమీటర్లకు భారీ మొత్తంలో బాడుగగా నిర్ణయించారు. ఆస్పత్రి వద్ద ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు తప్ప ఇతర వాహనాలు ఆస్పత్రి వద్దకు రాకుండా వీరంతా ప్లాన్ చేశారు. ఎవరికి అవసరమైనా అక్కడున్న ప్రైవేటు అంబులెన్స్‌లలో వారు చెప్పినంత ఇచ్చి వెళ్లాల్సిందే. అయితే ఆస్పత్రిలోని కొందరు డాక్టర్ల సహకారంతోనే ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు ఇష్టానుసారంగా బాడుగలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న రోగులతో ఆడుకోవడంపై పట్టణంలో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానంతోనే అధిక రాబడి



సమావేశానికి హాజరైన రైతులు, క్షేత్ర స్థాయిలో యాప్‌ను రైతుల ఫోన్లలో డౌన్‌లోడ్ చేయిస్తున్న వ్యవసాయ అధికారులు

గుడిపాల: అధిక రాబడి సాంకేతిక పరిజ్ఞానంతోనే సాధ్యమవుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ, వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మండలంలోని 197రామాపురం, వసంతాపురం గ్రామాలో శనివారం స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో సరికొత్త విషయాలు తెలుసుకోవడానికి స్మార్ట్ ఫోన్ చాలా ముఖ్యమన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఏవైనా సమస్యలను డి జిటల్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు వాతావరణ స్థితిగతులు, వివిధ మార్కెట్లలో పంటల ధరలు తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించి మొబై ల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజినీకాంత్, వ్యవసాయశాఖ సిబ్బంది యోగప్రియ, సోనియా, తులసీ రాంరెడ్డి, రైతన్నలు పాల్గొన్నారు.

తుమ్మిందలో మట్టి తవ్వేస్తున్నారు



చిత్తూరు మండలం తుమ్మింద చెరువులో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీలు పెట్టి మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్లతో అక్రమంగా తరలించేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పగటి పూటే మట్టి తవ్వుకుంటున్నారు. చెరువులో మట్టి తవ్వి చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముకుంటున్నారు. లోడ్ రూ.600 నుంచి రూ. 1000 వరకు అమ్ముకుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇది తెలిసినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

– కాణిపాకం

పత్రికాస్వేచ్ఛను కాపాడుకోవాలి

తవణంపల్లె: పాత్రికేయులు పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజల పక్షాన నిలవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏపీయూడబ్ల్యూజే సౌజన్యంతో శనివారం తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పాత్రికేయ మిత్రులకు పంచిపెట్టారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ పత్రికలు సమాజానికి కళ్లు, చెవులు వంటివని అన్నారు. ముఖ్య విషయాల సేకరణలో పాత్రికే యులు బాధ్యతాయుతంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తవణంపల్లె ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతరకైనా జీతాలు ఇస్తారా..?

పలమనేరు: మూడు నెలలుగా జీతాలు రాక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని పట్టణంలో జాతర మొదలైనందున పండుగకైనా జీతాలు ఇస్తే ఇవ్వాలని పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పనిచేసే కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా స్థానిక ఆస్పత్రి వద్ద శనివారం వారు ఆందోళన చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణికి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఇందులో కార్మిక సంఘ నేతలు రామక్రిష్ణ, నారాయణ, శ్యామల, విజయమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి


రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పైమాఘంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్ వేలు 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిస్తే వ్యాధులు దూరమవుతాయని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ,104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

టి.పుత్తూరులో వైద్య సేవలు

మండలంలోని టి.పుత్తూరులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 35 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవడం మంచిదని పేర్కొన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డిబ, ఏఎన్‌ఎం లావణ్య, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బసవాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని బసవాపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సంధ్య 62 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రోస్లిన్, నిత్య, పంకజ, ప్రవీణ్ పాల్గొన్నారు.



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య, తవణంపల్లె: వైద్య సేవల్లో డాక్టర్ కేశవనారాయణ

ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి

ఐరాల: ప్రస్తుతం ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు, వృద్ధులకు వడదెబ్బ నియంత్రణపై అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో వడగాడ్పుల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని, ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

సీహెచ్‌సీలకు మంగళం..!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీల ద్వారా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు
- మండలానికి 17 రైతు సంఘాలకు పంపిణీ చేసిన గత ప్రభుత్వం
- విస్తృతంగా ప్రయోజనం పొందిన రైతులు
- కూటమి ప్రభుత్వంలో వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలు
- పార్టీ నేతలు, సానుభూతి పరులకే దక్కిన వైనం!


గత ప్రభుత్వంలో సీహెచ్‌సీ సంఘానికి ట్రాక్టర్ అందజేసిన వ్యవసాయ అధికారులు (ఫైల్)

గుడిపాల: ప్రజలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటు, సంక్షేమం అందిస్తూ వారిని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, వ్యవస్థలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ అందించేందుకు నెలకొల్పిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలదీ అదే పరిస్థితి. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో కియోస్క్ సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం.. వాటి పరిధిలోని కస్టమ్ హైరింగ్ సెంటర్ల(సీహెచ్‌సీ)కు సైతం చరమగీతం పాడింది. రైతులకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పరికరాలను ఇచ్చేందుకు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు చేసింది. గ్రామాల్లో రైతుసంఘాలు ఏర్పాటు చేసి వాటిని కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)గా పేరుపెట్టారు. ప్రతి సంఘానికి రూ.12 లక్షల నుంచి రూ.15లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో 26 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటికి 40శాతం రాయితీ, 60శాతం బ్యాంకు రుణంతో ట్రాక్టర్లు, రొటో వేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, దుక్కుసెట్లు తదితర వ్యవసాయ పరికరాలు అందజేసింది. వీటిని సంఘంలోని రైతులు వినియోగించుకోవడంతో పాటు గ్రామాల్లోని ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన వచ్చేవారు. దీనివల్ల రైతులందరికీ ప్రయోజనం కలిగేది. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు సంఘాలుగా కాకుండా వ్యక్తిగతంగా కొందరికి పరికరాలు పంపిణీ చేసి మమ అనిపించింది. కూటమి సానుభూతిపరులకే ఇవి దక్కాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా సీహెచ్‌సీలకు యంత్ర పరికరాలు అందజేసి ఉంటే అందరికీ ప్రయోజనం కలిగేదని రైతులు నిట్టూరుస్తున్నారు.


రొటోవేటర్లను అందిస్తున్న అధికారులు(ఫైల్)

గత ప్రభుత్వ విధానంతోనే మేలు

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా ట్రాక్టర్‌తో పాటు వివిధ యంత్ర పరికరాలు ఇచ్చారు. సంఘంలో ఉన్న రైతులతో పాటు మిగతా రైతులు కూడా అద్దె చెల్లించి వాటిని వాడుకొనే వాళ్లం తక్కువ అద్దెకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉండటం వల్ల పెట్టుబడి ఖర్చు కొంతవరు తగ్గేది. ఇప్పుడు కొంతమందికే యంత్ర పరికరాలు ఇవ్వడం వల్ల వారికి తప్ప మిగతా రైతులకు ప్రయోజనం ఉండదు.

–రాజా, రైతు,కొత్తపల్లె, గుడిపాల

రైతులందరికీ మేలు చేయాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకునే వారు. కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా రైతులందరికీ మంచి చేయాలి. ప్రధానంగా యంత్ర పరికరాలను వ్యక్తిగతంగా వినియోగించుకునేలా కొంతమంది రైతులకే ఇవ్వడం సరికాదు. గతంలో మాదిరిగా సంఘాలను ఏర్పాటుచేసి ఇస్తే రైతులంతా వినియోగించుకుంటారు.

– సూరి, రైతు, బొమ్మసముద్రం, గుడిపాల

